# నామినేషన్ వేసిన నాయిని




వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి శనివారం నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏఐసీసీ సభ్యుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ తోట వెంకన్న, మాజీ కౌన్సిలర్ బుద్ధ జగన్, జిల్లా మైనారటీ సెల్ చైర్మన్ అజీజ్‌ఖాన్‌లతో కలసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రమేశ్‌కు నామినేషన్ అందజేశారు.

**- వరంగల్ వాయిస్, హనుమకొండ**


వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 118    శనివారం | 04 నవంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5


# బీఆర్ఎస్ సెల్ఫ్ డిఫెన్స్




## అధికార పార్టీ చుట్టుముడుతున్న సమస్యలు

- కాళేశ్వరం బ్యారేజీపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- సెంటిమెంట్‌తో గులాబీ పార్టీ ప్రతి దాడి
- తెలంగాణ వ్యతిరేకులంతా ఒక్కటవుతున్నారంటూ ప్రచారం
- కాంగ్రెస్ వస్తే అంధకారమే అంటూ సెటైర్లు

ప్రపంచంలోనే అద్భుత ఎత్తిపోతల పథకం కాళేశ్వరం అంటూ గొప్పగా చెప్పుకున్న అధికార బీఆర్ ఎస్ పార్టీని సమస్యలు ఒక్కటొక్కటిగా చుట్టుముడుతున్నాయి. అసలు కాళేశ్వరం బ్యారేజీ ప్లానింగ్, డిజైన్ సరిగా లేదంటూ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సంచలన నివేదిక ఇవ్వడంతో గులాబీ పార్టీ ఆత్మరక్షణలో పడింది. అయితే సమస్యను పక్కదారి పట్టించడంలో కేసీఆర్ ను మించిన వారు లేరనే చెప్పవచ్చు. అందులో భాగంగానే మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ దిశగా బీఆర్ఎస్ మెల్లగా అడుగులు వేస్తోంది. తెలంగాణ వ్యతిరేకులంతా ఏకమవుతున్నారన్న వాదన తెరపైకి తెస్తున్నారు. బీఆర్ ఎస్ అధికారంలోకి రాకపోతే అభివృద్ధి కుంటుపడుతుందంటూ ప్రచారం సాగిస్తున్నారు. సీఎం కేసీఆర్ తో సహా మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు ఈ వాదననే ప్రధానంగా వినిపిస్తున్నారు. అయితే తెలంగాణ ఏర్పాటైతే భోజనం మానేస్తానన్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తో బీజేపీ జతకట్టడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి


వివరాలు 2లో..




## నాన్న కళ్లలో ఆనందం చూడాలి

- తండ్రి విజయానికి వినీత్ ఆరాటం
- ప్రదీప్ రావును అసెంబ్లీకి పంపడమే లక్ష్యంగా అడుగులు
- తూర్పులో కాషాయ జెండా ఎగరడం ఖాయం
- కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందిస్తాం..
- బీజేపీ యువనేత ఎర్రబెల్లి వినీత్ రావు




7లో..


## పాలన గొప్పగా సాగుతోంది

**అభివృద్ధి, సంక్షేమం దిశగా సాగుతున్నాం**

**తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్**


8లో







## బీఆర్ఎస్‌లో చేరిన రాకేష్ రెడ్డి

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి శనివారం సాయంత్రం మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. విద్యార్థి నాయకుడిగా ఎదిగిన రాకేష్ రెడ్డికి బీజేపీ టికెట్ దక్కక పోవడంతోపాటు కనీసం పార్టీ నుంచి సానుభూతి కూడా లభించకపోవడంతో ఆయన పార్టీ మారినట్లు తెలుస్తోంది.

- వరంగల్ వాయిస్, హనుమకొండ

# బీఆర్ఎస్ సెల్ఫ్ డిఫెన్స్




**అధికార పార్టీ చుట్టుముడుతున్న సమస్యలు**

**కాళేశ్వరం బ్యారేజీపై వెల్లువెత్తుతున్న విమర్శలు**

**సెంటిమెంట్‌తో గులాబీ పార్టీ ప్రతి దాడి**

**తెలంగాణ వ్యతిరేకులంతా ఒక్కటవుతున్నారంటూ ప్రచారం**

**కాంగ్రెస్ వస్తే అంధకారమే అంటూ సెటైర్లు**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఎన్నికల వేడి రాజుకుంటున్న కొద్దీ ప్రచారంలో కొత్తకొత్త అంశాలు తెరపైకి వస్తున్నాయి. విమర్శలు హద్దులు దాటుతున్నాయి. రాహుల్‌ను ముద్ద పప్పు, రేవంత్‌ను పప్పు అంటూ మంత్రి కేటీఆర్ చేసిన విమర్శలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ దిశగా బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. తెలంగాణ వ్యతిరేకులంతా ఏకమవుతున్నారన్న వాదన తెరపైకి తెస్తోంది. బీఆర్ ఎస్ అధికారంలోకి రాకపోతే అభివృద్ధి కుంటుపడుతుందని, మనల్ని మళ్లీ ఆంధ్రలో కలిపేస్తారన్నట్లుగా ప్రచారం సాగిస్తున్నారు. సీఎం కేసీఆర్ తో సహా మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు ఈ వాదననే ప్రధానంగా వినిపిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటైతే భోజనం మానేస్తానన్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తో బీజేపీ జతకట్టడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలంటున్నారు.

## అన్నీలోపాలే..

ఇంతకాలం ఎంతో గొప్పగా చెప్పుకున్న కాళేశ్వరం బ్యారేజ్ ఇప్పుడు అధికార బీఆర్ ఎస్ పార్టీని అప్రతిష్ఠపాలు చేస్తోంది. మేడిగడ్డ బరాజ్ కుంగడానికి ప్లానింగ్, డిజైనింగ్, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ మెయింటనెన్స్ ప్రధాన వైఫల్యాలుగా కేంద్ర బృందం నిర్ధారించింది గులాబీ పార్టీ నేతలు కుడిదిలో పడిన ఎలుకలుగా మారారు. బ్యారేజీ పునాది కింద ఉన్న ఇసుక కొట్టుకుపోవడం వల్ల ఫిల్లర్ల సపోర్ట్ బలహీనపడిందని, ఫౌండేషన్ మెటీరియల్ పటిష్టత సామర్థ్యం తక్కువగా ఉందని, బ్యారేజీ లోడ్ వల్ల ఎగువన ఉన్న కాంక్రీట్ వైఫల్యాలు ఫిల్లర్లు కుంగిపోవడానికి కారణాలని కేంద్ర బృందం నిగ్గుతేల్చింది. ప్రణాళిక, రూపకల్పన సరిగా లేకపోవడం బ్యారేజీ వైఫల్యాలను స్పష్టం చేస్తోందని కేంద్ర బృందం తమ నివేదికలో పేర్కొంది. కాళేశ్వరం బ్యారేజీ ఎగువ, దిగువ రెండు వైపులా కింద ఉన్న రాక్ చేరుకోవడానికి కాంక్రీట్ గోడలు ఉపయోగించారని, దీనిని పరిశీలిస్తే ప్లానింగ్ ప్రకారం డిజైన్ జరగకపోవడం, డిజైన్ చేసిన విధంగా నిర్మాణం లేకపోవడాన్ని కేంద్ర బృందం గుర్తించింది. 2019లో బ్యారేజీ ప్రారంభించినప్పటి నుండి ప్రాజెక్ట్ ఇంజనీర్లు సిమెంట్ కాంక్రీట్ దిమ్మెలను, లాంచింగ్ అప్రాన్ లను సరిగా పరిశీలించలేదని, నిర్వాహణలో వైఫల్యం చెందారని ఫలితంగానే బ్యారేజీ క్రమంగా బలహీనపడి ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని నివేదికలో పేర్కొన్నారు. దీంతో బీఆర్ ఎస్ పార్టీ సెల్ఫ్ డిఫెన్స్ లో పడింది.

## వెల్లువెత్తుతున్న విమర్శలు..

లక్షల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వినియోగించిన నిర్మించిన కాళేశ్వరం బ్యారేజ్ పనికిరాకుండా మారడంతో రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. మొదటి నుంచి కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్న ప్రతిపక్షాల వాదనకు దీంతో బలం చేకూరింది. బ్యారేజీ నిర్మాణ లోపాలతో అధికార బీఆర్ ఎస్ పార్టీ అపవాదులను మూటగట్టుకుంది. కాళేశ్వరం పేరుతో పుట్టబోయే బిడ్డకు కూడా కొంత అప్పు చేశారంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఈ ప్రాజెక్టుతో ప్రజలకు మేలు కంటే కీడే ఎక్కువగా జరిగిందంటూ విమర్శిస్తున్నారు. వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం గోదావరి పాలు చేసిందంటూ మండిపడుతున్నారు. అయితే ఈ అపవాదునుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు బీఆర్ ఎస్ నేతలు కొత్తకొత్త వ్యూహాలు రచిస్తున్నారు. ప్రజలను ఏమార్చి ఎన్నికల్లో లబ్ది పొందేలా సీఎం కేసీఆర్ తో సహా మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు తెలంగాణ సెంటిమెంట్ ను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

## కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు..

ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు హద్దులు దాటుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ ముసుగులో తెలంగాణ ద్రోహులందరూ ఒక్కటవుతున్నారని మంత్రి హరీశ్‌రావు తాజాగా ఆరోపించడం పెద్ద దుమారాన్నే సృష్టిస్తోంది. తెలంగాణ ఏర్పాటైతే భోజనం మానేస్తానన్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బీజేపీతో జతకట్టారని, తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్‌తో కలిసిపోయిందంటూ విమర్శిస్తున్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ఓట్లు చీలకుండా చేసి, తద్వారా బీఆర్ఎస్‌కు నష్టం కలిగించేలా టీడీపీ పోటీ నుంచి తప్పుకుందంటున్నారు. ఇలా తెలంగాణ ద్రోహులందరూ ఒక్కట్కె కుట్రలతో మన వీరీదకు దాడికి వస్తున్నారని హరీష్ రావు తాజాగా మరోమారు సెంటిమెంట్ ఎత్తుకున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కూడా తెలంగాణ వ్యతిరేకి అని, గతంలో ఆయన తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీతో దాడికి యత్నించారని, తెలంగాణ వ్యతిరేకులతో రేవంత్‌రెడ్డి దోస్తీ చేశారని, పదవిని త్యాగం చేయకుండా పట్టుకుని వేలాడారని విమర్శించారు. అదే దారిలో బీజేపీ నేత కిషన్‌రెడ్డి నడిచారని, వీరందరితో మనకు పోటీనా అంటూ హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ కోసం నిలబడిన నిఖార్సైన కేసీఆర్‌తో తెలంగాణ వ్యతిరేకులు పోటీ పడుతున్నారన్నారు. ఇక కాంగ్రెస్ గెలిస్తే అభివృద్ధి ఆగిపోతుందని నిన్న మొన్నటి వరకు ప్రచారం చేస్తూనే తాజాగా కొత్తగా ఈ పల్లవి అందుకున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో పాత కష్టాలు మళ్లీ మొదలవుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోవైపు హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో పడిన కరెంటు, నీటి కష్టాలు, మళ్లీ వస్తాయని హెచ్చరించారు. ఒక్కచాన్స్ అంటూ జనం ముందుకొస్తున్న ఆ పార్టీకి గతంలో 11 సార్లు అవకాశమిస్తే ఏం చేసిందో చెప్పాలంటున్నారు.

## ద్రోహులంతా ఆయన మంత్రి వర్గంలోనే..

అయితే బీఆర్ ఎస్ విమర్శలను కాంగ్రెస్, బీజేపీలు దీటుగా తిప్పికొడుతోంది. నిజానికి తెలంగాణ ద్రోహులను చేర్చుకున్నదే కేసీఆర్ కాదా అని ప్రశ్నిస్తున్నారు. వారంతా ఆయన మంత్రివర్గంలో ఉన్నారంటూ ఆరోపిస్తున్నారు. ఉద్యమకారులంతా బయట ఉన్నారని, వారికి ఎక్కడా చోటు దక్కలేదంటున్నారు. ప్రాణత్యాగం చేసిన వారి కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయంటూ విమర్శిస్తున్నారు. కేసీఆర్ కుటుంబం మాత్రమే అధికారం అనుభవిస్తోందని మండిపడుతున్నారు. ఇది ముమ్మాటికీ నిజం అంటూ కాంగ్రెస్, బీజేపీలు ఎప్పటినుంచో ఆరోపిస్తున్నాయి. దీనికి ఎలాంటి సమాధానం లేదు. తెలంగాణ ప్రజలంతా తమ కుటుంబమే అంటున్న కేటీఆర్..ఏ ఒక్క కుటుంబాన్ని ఎందుకు దగ్గరకు రానీయడం లేదో చెప్పాలంటున్నారు. కేసీఆర్ పాలనా కుటుంబంలో వీరే ఎందుకు ఉండాలంటూ నిలదీస్తున్నారు. మిగతా వారెందుకు బయట ఉండాలంటున్నారు. వారంతా కేసీఆర్ కుటుంబంలో ఉంటే ఎందుకు ప్రగతి భవన్‌కు దూరంగా ఉండాలో కేటీఆర్ సమాధానం చెప్పాలని బీజేపీ నిలదీస్తోంది. తెలంగాణ ఇచ్చినందుకు సోనియాకు, రాహుల్‌కు కృతజ్ఞతలు చెప్పిన కేసీఆర్ ఇప్పుడు వారిని పప్పు అంటూ విమర్శించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రాజకీయాల్లో హుందా విమర్శలు ఉండాలంటూ హితబోధ చేస్తున్నారు.

## రాష్ట్రంలో పలు సమస్యలు..

ఇకపోతే తెలంగాణలో పాలనకు బ్రాండ్ తామే అన్న విధంగా బీఆర్ ఎస్ ప్రచారం సాగిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ ఆగమవుతుందంటున్నారు. నిజానికి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిపై ఎక్కడా చర్చించడం లేదు. మరోమారు గెలిస్తే వాటిని పరిష్కరిస్తామంటూ కూడా ఎవరూ చెప్పడంలేదు. పదేళ్లలో తాము చేసిందే గొప్ప అని ప్రచారం చేసుకుంటున్నారు. తాము ఎన్నో ప్రయాసల కోర్చి.. రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, అవినీతికి తావులేని ధరణిని తీసుకొస్తే దాన్ని రద్దు చేసి బంగాళాఖాతంలో పడేస్తామని కాంగ్రెస్ చెప్పడాన్ని తప్పుబడుతున్నారు. ధరణిని తీసివేస్తే రైతుబంధు, రైతుబీమా ఎట్లా వస్తాయన్న ప్రశ్న లేవనెత్తుతున్నారు. పహాణీ నకల్ పేరు వీరీద మళ్లీ వీఆర్వోలు, ఎమ్మార్వోలు వస్తారని, వసూళ్లు చేస్తారని.. జలగల్లా పట్టి పీడిస్తారని, దీంతో దళారుల రాజ్యం ఏర్పడుతుందని ప్రజలను భయాలకు గురిచేస్తున్నారు. రైతుబంధుపై ప్రపంచ వ్యాప్తంగా అభినందనలు వచ్చాయని, కేవలం కాంగ్రెస్ నేతలే దుబారా అంటున్నారంటూ విమర్శిస్తున్నారు. నిజానికి రైతుబంధులో విపరీతమైన దోపిడీ జరగుతోంది. భూస్వాములకు కూడా రైతుబంధు ద్వారా వందల కోట్లు గడిస్తున్నారు. ఈ దుబారా వల్ల గత కొన్నేళ్లుగా వేలకోట్లు భూస్వాముల అకౌంట్ లలోకి చేరింది. ఈ నష్టానికి బాధ్యులు ఎవరు. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బును దుబారా చేయడం తగదని ఎందుకు ఆలోచన చేయడం లేదు. కేవలం బీదరైతులను మాత్రం ఆదుకుంటే ఎవరికి అభ్యంతరం ఉండదు. ఇకపోతే ధరణి వల్ల ఎందరికో అన్యాయం జరిగింది. ఈ అన్యాయాలను ప్రశ్నిస్తే ఎందుకు సరిదిద్దుకోరో చెప్పాలి. అంతేగానీ తెలంగాణ వ్యతిరేకులు అంటూ కాంగ్రెస్, బీజేపీలను విమర్శిస్తే ప్రజలు హర్షించరు. అయితే తెలంగాణ వల్ల ఎక్కువగా లబ్ది పడ్డది కేసీఆర్ కుటుంబం అయితే..నష్టపోయింది మాత్రం తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన వారి కుటుంబాలు.. పోరాడిన తెలంగాణ వాదులు మాత్రమే. మంత్రివర్గంలో తెలంగాణ వ్యతిరేకులనంతా పోగేసుకున్న కేసీఆర్ ప్రజలకు ఎందుకు సమాధానం చెప్పరంటూ నిలదీస్తున్నారు.

# తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ**




**వరంగల్ వాయిస్, క్రైం :** చెక్ పోస్ట్ ల వద్ద వాహనాల తనిఖీ సమయాల్లో పోలీసులు అప్రమత్తం ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సూచించారు. నర్సంపేట, ఖానాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని మంగలవారిపేట, బుధరావుపేట వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ లను శనివారం సీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ ల వద్ద పోలీసుల వాహన తనిఖీల తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీ చేపడుతున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చెక్ పోస్ట్ సిబ్బందికి వివరించారు. ఈ తనిఖీలో నర్సంపేట ఏసీపీ తిరుమల్, దుగ్గొండి సర్కిల్ ఇన్ స్పెక్టర్ పుల్లాల కిషన్, ఖానాపూర్ ఎస్సై మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వాహనాన్ని తనిఖీ చేయండి

**ఎన్నికల వ్యయ పరిశీలకులు అమిత్ ప్రతాప్ సింగ్**

**క్షేత్ర స్థాయిలో చెక్ పోస్టుల వద్ద వాహనాల పరిశీలన**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు అమిత్ ప్రతాప్ సింగ్ సూచించారు. శనివారం వరంగల్ (తూర్పు)106- నియోజక వర్గ పరిధిలోని అన్ లిమిటెడ్ వద్ద, లేబర్ కాలనీ గొర్రె కుంట క్రాస్ వద్ద స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్ బృందాల పనితీరు, వాహనాల తనిఖీ తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్థ నిర్వహణకు సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించుటకు గట్టి నిఘా పెట్టాలన్నారు. డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యయ పరిశీలన నోడల్ అధికారి, జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్ బాధ్యులు యుసుఫోద్దిన్, శ్రీనివాస రెడ్డి, సిబ్బంది కృష్ణ మూర్తి, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించే నరకాసుర వధ ఉత్సవాలకు వచ్చే ప్రజలకు సంబంధించిన వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాటు చేస్తామని ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపారు. నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో మట్టేవాడలో ట్రాఫిక్ సీఐ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 11న శనివారం ఉర్సుగుట్ట వద్ద నరకాసుర వధ కార్యక్రమానికి, సాంస్కృతిక కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు భక్తులు ప్రజలు వేలాది మంది పాల్గొంటున్నందున రోడ్లపై ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా కార్యక్రమాలు జరుపుకునే సమయంలో వాహనాలను ఆ స్థలం వద్దకు ప్రవేశించకుండా దూరంలో వాహనాలను నిలిపివేయాలని నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి సీఐ వెంకన్నను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉత్సవ కమిటీ నాయకులు వనం కుమార్, మరుపల్ల గౌతమ్, వంగరి సురేష్, దూడ కొమురెల్లి, తవుటం నరసింహ, కొమ్ము రాజులు ఉన్నారు.

## పరకాలలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల నియోజకవర్గంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధిస్తుందని యూత్ కాంగ్రెస్ నడికూడ మండల అధ్యక్షుడు అప్పం కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల మేనిఫెస్టో చూసి ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నేతగా, మచ్చలేని నాయకుడిగా పేరుపొందిన రేవూరి ప్రకాశ్ రెడ్డి విజయాన్ని ఎవరు ఆపలేరని అన్నారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీనీ గెలిపిస్తామని , ఇల్లు లేని నిరుపేదలకు, నిరుద్యోగులకు ప్రతి ఒక్క వర్గాలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అందరూ కలిసికట్టుగా పనిచేసి రేవూరి ప్రకాష్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన సీపీఐ నాయకులు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన సీపీఐ మాజీ పాలకుర్తి నియోజకవర్గ కార్యదర్శి ముద్దం మహబూబ్ రెడ్డి ఆధ్వర్యంలో సీపీఐ, బీఆర్ఎస్ పార్టీల నుంచి సుమారు 60మంది నాయకులు, కార్యకర్తలు శనివారం పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్ రావు అరాచక పాలనను తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రానున్న ఎన్నికల్లో పాలకుర్తిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రవేశపెట్టబోయే ఆరు గ్యారెంటీ హామీల కార్డులను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు సంయుక్తంగా మాట్లాడుతూ ఝాన్సీ యశస్విని రెడ్డి నాయకత్వంలో పాలకుర్తిలో అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పని చేస్తామని ముక్తకంఠంతో తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో అమ్మాపురం 12వ వార్డు సభ్యుడు కోటగిరి సంతోష్ గౌడ్, 3వ వార్డు సభ్యుడు గూడెల్లి సైదులు, దాసరి పులిందర్ రెడ్డి, భానోత్ నరసింహ, జనగాం భిక్షపతి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, తొర్రూరు మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, అమ్మాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలూరి జగన్, సీనియర్ నాయకులు కాందాడి అచ్చిరెడ్డి, ఏనుగంటి సత్యనారాయణ, గూడెల్లి సోమ నరసయ్య తదితరులు ఉన్నారు.

# ఎన్నికల వ్యయాలను పకడ్బందీగా నమోదు చేయాలి

### వ్యయ పరిశీలకుడు రాహుల్ పంజాబ్రావ్ గవాండే




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎన్నికల వివరాలను పకడ్బందీగా, నిబంధనల మేరకు నమోదు చేయాలని ఎన్నికల పరిశీలకులు అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాహుల్ పంజాబ్రావ్ గవాండే, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి హనుమకొండలో గల రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యయ వివరాల నమోదుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరంగల్ పశ్చిమ, పరకాల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలు, అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల నమోదు కోసం ఏర్పాటు చేసిన బృందాలు వాటి పనితీరు తదితర అంశాలను జిల్లా ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్ వివరించారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల టీమ్ లతో క్రమం తప్పకుండా సమావేశం నిర్వహిస్తున్నామని, ఇప్పటికే శిక్షణను సిబ్బందికి ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల ఖర్చులు నమోదు కోసం ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు స్టాటిక్ సర్వేలన్సు బృందాలు, వీడియో సర్వేలెన్సు బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలు పకడ్బందిగా విధులు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల సమయంలో నగదు, బంగారం, వస్తువుల పంపిణీ జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయి నుంచి వచ్చే ఫిర్యాదులు సమాచారం తీసుకుంటూ పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. సహాయ వ్యయ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, సహాయ వ్యయ పరిశీలన అధికారులు రిటర్నింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అనుమానాస్పద బ్యాంక్ లావాదేవీలు, రూ.10లక్షల కంటే మించి నగదు జమ, ఉపసంహరణ, ఆన్ లైన్ ద్వారా మల్టిపుల్ లావా దేవీలపై పర్యవేక్షణ చేయాలని అన్నారు. సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ప్రజలను ఎటువంటి ప్రలోభావాలకు గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి అని అన్నారు. ఇన్ కంటాక్స్, వాణిజ్య పన్నుల శాఖ, వ్యయ పరిశీలన శాఖలు ఎన్నికల వ్యయం నమోదులో సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎం సీఎంసీ కమిటీ ద్వారా రోజువారి దినపత్రికల్లో, లోకల్ ఛానెల్ లో వచ్చే పేడ్ న్యూస్ పై దృష్టి సారించాలన్నారు. సోషల్ మీడియా పై పటిష్టంగా ఉంచాలన్నారు. రాజకీయ పార్టీ లు సమావేశాలు నిర్వహించే సమయంలో వాటిని నిశితంగా రికార్డు చేయాలని, అక్కడ వినియోగించే ప్రతి వస్తు రేట్ చార్ట్ ప్రకారం అభ్యర్థి ఎన్నికల ఖాతాలో నమోదు జరిగే విధంగా నిబంధనలో మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రికార్డు పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, డీసీఓ నాగేశ్వరావు, డీసీపీ అబ్దుల్ బారి, ఐటీ అధికారులు, వీఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసీసీ, ఎంసీఎంసీ, టీమ్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధులకు సంచార వాహన వైద్య సేవలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఐనవోలు మండలం, పున్నేలు గ్రామంలోని గ్రామపంచాయతీ లో వృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవల ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహాకారంతో వయో వృద్ధులకు ఇంటి వద్దనే హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల ద్వారా సేవలను అందించడం జరుగుతుంది. ప్రతి నెల మీ గ్రామానికి వచ్చి క్యాంపు నిర్వహించి వృద్ధులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామాలలోని వృద్ధులంతా సద్వినియోగం చేసుకోవాలని పాలకవర్గం కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ రెడ్ క్రాస్ హనుమకొండ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు జి. కిషన్ రావు, టి.మదన్ మోహన్ రావు, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, అరువ గంగాధర్, పవన్, కేశోజు రమేష్, పోశాలు, గ్రామస్తులు , వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## కాంగ్రెస్ గెలుపునకు సైనికుల్లా పని చేయాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని ప్రగసింగారం, గోవిందపూర్, గొల్లపల్లి, నూర్జంపల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కూరాకుల రాజు బాబు, శ్రీనివాస్, లడే మనోహర్ రావు, దూదాటి రాజేందర్, కోరగాని వీరన్న, రామచంద్రు, ముఖిడి అప్పారావు, ఎండీ అంకుష్, చింతం రాజు, చింతం రమేష్, చింతం పవన్, దైనంపెల్లి శ్యామ్, సాయిలు, కొనకంటి లక్ష్మణ్, కొనకంటి గణపతి, పంగసమ్మయ్య, పంగ సురేష్ లతో పాటు సుమారు 20మంది బీఆర్ఎస్ కార్యకర్తలకు శనివారం టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని పార్టీలో చేరిన వారికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీ చల్ల చక్రపాణి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు చిందం రవి, మారపల్లి బుజ్జన్న, బాసని శంకర్, దుబాసి కృష్ణమూర్తి, డీటీ రెడ్డి, బాసని మార్కండేయ, మిట్టపల్లి సతీష్, మారపల్లి కటయ్య, రమేష్, కుమార్ పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరించిన కేసీఆర్‌ను గద్దె దింపుదాం

### ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్ గౌడ్



**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్ గౌడ్ మండిపడ్డారు. అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఎల్కతుర్తి మండల కేంద్రంలో శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్ మీట్ కు హాజరైన ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వుట్కూరి ప్రణీత్ గౌడ్ మాట్లాడుతూ 1200 మంది త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ, దాని భోగాలు ఒక కుటుంబం మాత్రమే అనుభవిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థలు అనేకరకాల మౌలిక సదుపాయాలు లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం విద్యార్థులకు ఫీజుఉ రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ ఇచ్చిన పాపాన ఈ ప్రభుత్వం పోలేదన్నారు. అదేవిధంగా నిరుద్యోగులను కేసీఆర్ సర్కార్ నమ్మించి నట్టేట ముంచిందన్నారు. విద్యారంగ సమస్యలు, ప్రజా సమస్యలు, కార్మిక సమస్యలు గాలికి వదిలేసి కేవలం ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని, అదేవిధంగా కేంద్రంలో ఉన్న బీజేపీ దేశ సంపదను మొత్తం ఎల్ఐసీ, రైల్వే, ఎయిర్ ఇండియా లాంటి అనేక ప్రజా సంస్థలను అదానికి అప్పజెప్పి దేశాన్ని కాజేస్తుందని, ఇట్లాంటి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని నిత్యం పేద బడుగు బలహీన వర్గాల కోసం కొట్లాడుతున్న పార్టీలకే ఓట్లు వేసి గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముంజ పూర్ణ గౌడ్, మాచర్ల రాజాగౌడ్, వి.సురేష్, మండ సాయిప్రభాస్, ఎం.సహర్ష్ పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసే పార్టీని ఆదరించండి

## చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 10వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొన్నారు. మహిళ సోదరీ, సోదరీమణులు బోనాలతో, హారతులతో బ్రహ్మరథం పట్టారు. అనంతరం వారితో కలిసి డప్పు చప్పులతో, ఆడబిడ్డలతో కలిసి ఇల్లు ఇల్లు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య పాదయాత్ర చేసి ఇంటింటికి తిరుగుతూ ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ 50ఏళ్లుగా తెలంగాణకు రోడ్లు, నీళ్లు, కరెంటు తేని మోసగాళ్ల పార్టీలు కాంగ్రెస్, బీజేపీలు అన్నారు. తెచ్చుకున్న తెలంగాణ ఆంధ్రుల చేతుల్లో పెట్టకండి. తెచ్చుకున్న తెలంగాణ దొంగల చేతుల్లో పెట్టకండని, తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి చేసుకోవడానికి మళ్లీ కేసీఆర్ చేతుల్లోనే పెట్టండని కోరారు. నాకు ఓటేసి గెలిపించండి అని అభ్యర్థించారు. ఇప్పుడు ఎన్నికల కోసం వచ్చేటువంటి వారు మీ సమస్యల కోసం మీ దగ్గరికి ఎప్పుడైనా వచ్చారా అని ప్రశ్నించారు .ఓట్ల కోసం మళ్లీ వస్తున్నారని, ఇలాంటి వాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతిపక్షాలు కేవలం ఎన్నికల అప్పుడే వస్తాయని, కల్లబొల్లి మాటలు చెప్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మాత గార్డెన్స్ లో మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోన శ్రీకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి పల్లం రమేష్ తోపాటు సుమారు 200మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్ధన్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు పులి సారంగపాణి, 10వ డివిజన్ అధ్యక్షుడు ఖలిల్ తోపాటు పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే అంధకారమే

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే రాష్ట్రంలో మళ్లీ అంధకారమే అవుతుందని పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శనివారం గీసుగొండ మండలం ఆరెపల్లి గ్రామం నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేస్తూ బీఆర్ఎస్ లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 60ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. ఆదమరిచి కాంగ్రెస్ కు ఓటు వేస్తే రాష్ట్రం అంధకారమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు. పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు తుమ్మనపల్లి బాబురావు, గ్రామ ఉపాధ్యక్షులు మోటం స్వామి, సీనియర్ నాయకులు మంద భిక్షపతి, ముదిరాజ్ సంఘం గ్రామ కార్యదర్శి పెండ్యాల సతీష్ తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో కొత్త రఘుపతి రెడ్డి, గ్రామ అధ్యక్షుడు సిందే విజయ్, కార్యదర్శి తుమ్మనపల్లి నరేష్, ఉప సర్పంచ్ ఏకాంబ కమలాకర్, యూత్ ప్రెసిడెంట్ ఏకాంబ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా




**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గంలో బీజేపీ పార్టీ చాప కింద నీరులా విస్తరిస్తుంది. పరకాల నియోజకవర్గంలో ప్రతి గ్రామ గ్రామాన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి నాయకులను భారీగా బీజేపీలో చేర్చుకుంటున్నారు. పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతిచాకచక్యంగా వ్యవహరిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ దళిత వర్గాలను బీజేపీలో చేరేలా క్రీయా శీలకంగా వ్యవహరిస్తున్నారు. శనివారం పరకాల బీజేపీ కార్యాలయంలో పెద్ద రాజుపేటకు చెందిన ముదిరాజులకు, యూత్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ నాయకుడు రాజయ్య యాదవ్ పార్టీలో చేరిన గువ్వ శరత్, గువ్వ గణేష్ ,యాట శ్రీకాంత్, గువ్వ తిరుపతి, వీర్ల రాజు, పల్లె రాజేష్, పాలకుర్తి అఖిల్, బొచ్చు శ్రీకాంత్, గువ్వ అనిల్ ,గువ్వ రాజేష్, గువ్వ దీక్షిత్, దామ అనిల్ లకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్తను తన కంటికి రెప్పలా కాపాడుకుంటానని పరకాల నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కాళి ప్రసాద్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్పీ జయంత్ లాల్, దేవునూరి మేఘనాథ్, సంగ పురుషోత్తం, మార్క సునీల్, పాలకుర్తి తిరుపతి, దుబాసి వెంకటస్వామి, మంద రామేశ్వర్, సమ్మయ్య, బూత్ అధ్యక్షులు లక్క సతీష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దోపిడి పాలనకు చరమగీతం పాడాలి

## కాంగ్రెస్ అభ్యర్థిని యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని సింగరాజు పల్లి, బంజారా గ్రామాలలో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి హనుమాండ్ల యశస్విని రెడ్డి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం కేసీఆర్ కుటుంబ దోపిడి పాలనకు స్వస్తి చెప్పి, పాలకుర్తి లో గత 15 ఏళ్ల ఎర్రబెల్లి దోపిడి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో కనీసం డిగ్రీ ఇంటర్ కళాశాల తీసుకురాని ఈ మంత్రి పాలన మనకు అవసరమా అని ప్రశ్నించారు. సామాన్య ప్రజలను సంక్షేమ పథకాల పేరుతో డబల్ బెడ్ రూమ్, దళితులకు మూడెకరాలు, దళిత బంధు, గిరిజన బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి, నిరుద్యోగ భృతి, గొర్రెల పంపిణీ, చేపల పంపిణీ ధకాలతో సామాన్య ప్రజలను యువతను మోసం చేసిన బీఆఎస్ పాలనకు బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇవ్వండని కోరారు. మాఅత్త మామలు 30ఏళ్ళుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు, నేను మీ ఆడపడుచు గా మీ ఇంటికి వస్తున్నానని, నాకు ఒక్క అవకాశం ఇచ్చి మీ అమూల్యమైన ఓటును వేసి గెలిపించండని కోరారు. గెలిచిన తర్వాత పాలకుర్తిలో గత 15ఏళ్లలో జరగని అభివృద్ధి ఐదేళ్లలో చేసి చూపిస్తానన్నారు. ఈ సింగరాజు పల్లి గ్రామాన్ని మండలంగా చేస్తామని హామీ ఇచ్చారు. సింగరాజు పల్లి బంజారా, గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆ పార్టీ వీడి యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు వెంగళ రావు, పెద్ది క్రిష్ణమూర్తి, నల్లా శ్రీరాములు, ఓయూ జేఏసీ నాయకులు, ఇప్ప పృథ్వీరెడ్డి, రెడ్డిరాజుల రమేష్, భూక్యా సర్జన్, కాడబోయిన గణేష్, యువజన యూత్ కాంగ్రెస్ నాయకులు, తోటకూరి రమేష్, ఉప్పుల, అనిల్, ప్రకాశ్, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లోకి వలసల జోరు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండంలోని మైలారం గ్రామానికి చెందిన రెడ్డి సామాజిక వర్గం, యాదవ్ సంఘం నుంచి శనివారం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను వీడి భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో చేరారు. మైలారం గ్రామం నుంచి దాదాపు 50మంది బీఆర్ ఎస్ పార్టీలో చేరారు. రెడ్డి సామాజిక వర్గం నుంచి అమిరెడ్డి మల్లారెడ్డి, చల్లా దయాకర్ రెడ్డి, చల్లా రాజిరెడ్డి, దూదిపాల కొమరారెడ్డి, దూదిపాల తిరుపతి రెడ్డి, దూదిపాల పృథ్వీధర్ రెడ్డి, చల్లా మహేందర్ రెడ్డి, ఊకంటి మహేష్ రెడ్డి, దూదిపాల పెద్దన్న, దూదిపాల విష్ణువర్ధన్ రెడ్డి, దూదిపాల రాజు, సొంటి రెడ్డి జనార్దన్ రెడ్డిలు చేరగా, యాదవ సంఘం నుంచి తల శ్రీను, బొంతల తిరుపతిలతో పాటు దాదాపు 50మంది బీఆర్ఎస్ లో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి, గ్రామ అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్, ఎంపీటీసీ గడిప విజయ విజయ్, మైలారం ఉప సర్పంచ్ అర్జల సునీత సాంబరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ మస్కే సదయ్య, పార్టీ నాయకులు నూనె కిరణ్, మోతె సమ్మయ్య, చల్ల నరసింహా రెడ్డి, బత్తిని చిన్న తిరుపతి, అరికిల్ల వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# గుగులోత్ లింగా నాయక్‌కు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండలంలోని బావోజి గూడెం గ్రామా శివారు వెంకురం తండాకు చెందిన గుగులోతు లింగా నాయక్ ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన 83వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టా పొందారు. “కంపారటివ్ స్టడీ ఆఫ్ శ్రీమద్భగవద్గీత, బంజారా భగవద్గీత” అనే అంశంపై డాక్టర్ వి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధక గ్రంథానికి గాను ఈ డాక్టరేట్ లభించింది. ఈ డాక్టరేట్ పట్టాను లింగా నాయక్ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దండెబోయిన రవీందర్, అమెరికాకు చెందిన అడోబ్ కంపెనీ సీఈఓ పద్మశ్రీ డా.శంతను నారాయణన్ ల చేతుల మీదుగా అందుకున్నారు. భారతదేశంలోనే తొలిసారిగా సంస్కృతం లో బంజారా భగవద్గీత పై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించిన తొలి వ్యక్తిగా లింగా నాయక్ నిలిచారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే సంస్కృతంలో డాక్టరేట్ అందుకున్న మూడవ గిరిజన పరిశోధక విద్యార్థిగా కూడా నిలిచారు. సంస్కృత అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యావంతులు అభినందించారు.

# బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొండేటి శ్రీధర్ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వర్ధన్నపేట మండలం కట్య్రాల గ్రామంలో బూత్ నెంబర్ 225, 226లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బూత్ అధ్యక్షులు చిర్ర రాకేష్, బండారి ప్రశాంత్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు జడ సతీష్, మండల యువమోర్చా అధ్యక్షుడు చెంగల సురేష్, జిల్లానాయకులు కుందూరు మహేందర్‌రెడ్డి, ఇటికాల ప్రశాంత్, నాంపల్లి కుమార్ రాజా, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చల్లాను భారీ మెజార్టీతో గెలిపించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని 15వ వార్డులో శనివారం ఎమ్మెల్యే ధర్మారెడ్డి కారు గుర్తుకు ఓటు వేయాలని కౌన్సిలర్ చందుపట్ల సుజాత సాయి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అధిక మెజార్టీతో గెలిపించాలని, హ్యాట్రిక్ సాధించి మంత్రి పదవి పొందుతారని అన్నారు. ఈ ప్రచార భాగంలో టౌన్ ప్రెసిడెంట్, సమన్వయ కమిటీ, మెంబర్లు , మాజీ కౌన్సిలర్, సింగిల్ విండో వైస్ చైర్మన్, కోఆప్షన్ మెంబర్ యూత్ ఇంచార్జి, అధ్యక్షులు, కార్యదర్శి, వార్డు కమిటీ, యూత్ కమిటీ, మహిళా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# ఖబడ్దార్ పొన్నం ప్రభాకర్

## ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సహించం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూరు గ్రామంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మార్పాటి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ శనిగరపు సదానందం ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జడ్పీటీసీ వంగ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ భీమదేవరపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ రసూల్ పల్లి కొత్తకొండ లో ప్రచారంలో ఎమ్మెల్యే సతీష్ కుమార్ పై పొన్నం ప్రభాకర్ మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలు సబబు కాదన్నారు. నిజానికి ఎమ్మెల్యే సతీష్ కుమార్ 119నియోజకవర్గాల్లో మంచికి మారుపేరు, సౌమ్యులు, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం అట్లాంటి ఎమ్మెల్యే మీద స్వార్థపూరితమైన ఆలోచనలతో మాట్లాడడం, పొన్నం ప్రభాకర్ వ్యక్తిగత విమర్శలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తామన్నారు. గతంలో పార్టీ విస్తృత ప్రచారం జరుగుతుండగా ప్రవీణ్ రెడ్డి, చాడ వెంకటరెడ్డి ఇలాంటి మాటలు మాట్లాడలేదని అన్నారు. 1993సంవత్సరంలో ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడిగా పొన్నం ఉన్నప్పుడు చేసిన హత్యా, గుండా రాజకీయాల గురించి ఉమ్మడి జిల్లాలో ఉన్న కరీంనగర్ ప్రజలందరికీ తెలుసన్నారు. అయ్యా పొన్నం ప్రభాకర్ 2009 నుంచి 2014 వరకు మీరు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంపీగా ఉన్నప్పుడు మీరు చేసిన భూ కబ్జాలు, అక్కడి వ్యాపారస్తుల నుంచి బలవంతంగా చందాలు వసూలు చేసిన చరిత్ర మీది అని అన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీ పోటీ చేసిన క్రమంలో మిమ్మల్ని అక్కడి ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించిన సిగ్గు రాలేదని ఆయన అన్నారు. ఇంకొకసారి వొడితల సతీష్ బాబు గురించి ఒక్క మాట మాట్లాడినా పొన్నం ప్రభాకర్ ఖబడ్దార్ అని సవాల్ చేశారు. ఈకార్యక్రమంలో ముల్కనూరు గ్రామ సర్పంచ్ మాడుగుల ప్రెస్ కొంరయ్య, ఎంపీటీసీ1 బొల్లంపల్లి రమేష్, ఎంపీటీసీ2 అప్పని పద్మ భిక్షపతి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మండలి సురేందర్, ఎంపీపీ జక్కుల అనిత రమేష్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శనిగరపు సదానందం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్పాటి మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సంగ సంపత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దార్న శ్రీనివాస్, మాడిశెట్టి కుమారస్వామి, ఎల్తూరి ప్రభాకర్, అంబాల చక్రపాణి, అంబాల రాజు, సల్పాల తిరుపతి, దొంతరవేన వెంకటేశ్వర్లు, గడ్డం వెంకన్న, ఇలందుల బాబు, మార్పాటి శ్రీనివాస్, రచ్చ సంపత్, జనగాని సమ్మయ్య, గుడికందుల పూర్ణచందర్, సుధాకర్, ఎదులాపురం సంపత్, తదితరులు ఉన్నారు.

## ఎర్రబెల్లికి నామినేషన్ ఖర్చులు ఇచ్చిన మాజీ సర్పంచ్ దంపతులు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నామినేషన్ ఖర్చుల నిమిత్తం తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సాయిలు -మాధవి దంపతులు రూ.10 వేలను విరాళంగా అందజేశారు. శనివారం వారు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును కలిసి ఆ మొత్తాన్ని అందచేశారు. అలాగే మంత్రికి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి వారిని సన్మానించి, వారికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

## చల్లా గెలుపు కోరుతూ ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మూడో సారి లక్ష మెజారిటీతో గెలవాలని కోరుతూ గ్రామ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి ప్రచారం, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గోల్కొండ సదానందం, సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు, బూత్ కమిటీ కన్వీనర్లు, కో కన్వీనర్లు, బూత్ కమిటీ ఇంచార్జిలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు

## కాంగ్రెస్ అభ్యర్థి దొంతి మాధవరెడ్డి



**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, 10సంవత్సరాల కాలంలో ఎలాంటి అభివృద్ధి చెయ్యకపోవడంతో నిరుత్సాహం చెందిన గ్రామ ప్రజలు నర్సంపేట కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దాదాపు 70 కుటుంబాలకు చెందిన వారు పార్టీ లో చేరగా వారిని పార్టీ కండువా కప్పి సాదరంగా కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ,కల్వకుంట్ల చంద్రశేఖర్రావు ఉద్యమ సమయంలో తెలంగాణ ప్రజలను నమ్మించి, బురిడీ కొట్టి అధికారంలోకి వచ్చారని అన్నారు. ముఖ్యమంత్రి కాక ముందుకు చంద్రశేఖర రావు వచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని, మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏదో త్వరగా పెట్టేందుకు ప్రజలను నమ్మించి మోసం చేసి ఓట్లు వేయించుకుని గెలవాలని ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం పార్టీలకు అతీతంగా నిరుపేదలకు ప్రతి ఒక్కరికి ఇల్లు వచ్చేలా, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ ఉప్ప సర్పంచ్ ముంజ రాజశ్రీ-సురేష్, వార్డు మెంబర్లు లక్క రాజు-లతిత, కొమ్ముక రాజేందర్ ఇందిరా, బీజేపీ పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులు ఎస్సి సెల్ నుంచి కొమ్ముక రవి-మమత, యూత్ ప్రధాన కార్యదర్శి జి.అశ్విన్ కుమార్ గౌడ్, రెడ్డి సంఘం నాయకులు సురేందర్ రెడ్డి, కంది సునీల్ రెడ్డి, కంది మహేందర్ రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు పాండవుల రామకృష్ణ, కక్కేర్ల రాజుకుమార్, కక్కేర్ల సాంబమూర్తి, గడ్డమీది నర్సింహాస్వామి, ఆరెల్లి ప్రకాష్, కొమ్ముక విజేందర్, కొమ్ముక అశోక్, కొమ్ముక ఎర్ర సాంబయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నర్సంపేట నియోజకవర్గ నాయకులు, దుగ్గొండి మండల పార్టీ అధ్యక్షులు, మండల క్లస్టర్ ఇంచార్జిలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత విద్య, వైద్యం, ఉపాధి బీఎస్పీతోనే సాధ్యం



**వరంగల్ వాయిస్, కురవి:** ఉచిత విద్య, వైద్యం, ఉపాధి బిఎస్పీ తోనే సాధ్యమని బహుజన్ సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పార్వతి రమేష్ నాయక్ తెలిపారు. శనివారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ అసెంబ్లీ కురవి మండలంలోని రేకుల తండాలో విద్యార్థులను, యువకులను, రైతులను కలసి మాట్లాడారు. ఈ సందర్భంగా పార్వతి నాయక్ మాట్లాడుతూ బీఎస్పీకి అధికారమిచ్చి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ముఖ్యమంత్రి చేయాలన్నారు. గురుకుల సెక్రటరీగా గురుకులాల్లో అద్భుతమైన ఫలితాలనిచ్చి, ప్రపంచ దేశాలను ఆకర్షించిన విధానాన్ని మనం, మన పిల్లలు చూశామని తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాల ప్రజల బాధలు తీరుతాయని పేర్కొన్నారు. నాకు డోర్నకల్ ఎమ్మెల్యే గా అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పథం వైపు నడిపిస్తానని, గురుకుల బిడ్డగా మీ ఇంటి ఆడపిల్లగా అడుగుతున్నానని, ఏనుగు గుర్తుపై ఓటేసి నన్ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి, డోర్నకల్ అసెంబ్లీ ఇంచార్జి ఐనాల పరశురాములు, జిల్లా ఈసీ మెంబర్ ఎడ్ల శ్రీను, డోర్నకల్ అసెంబ్లీ మహిళ కన్వీనర్ జినక సువార్త, కురవి మండల అధ్యక్షుడు మేడి రాములు, మరిపెడ మండల అధ్యక్షుడు జినక కృష్ణమూర్తి, చిన్నగూడూరు మండల మహిళ కన్వీనర్ వంగూరి స్వరూప, స్వేరో స్టూడెంట్ నాయకురాలు గుగులోత్ మమత, నాయకులు బానోత్ పవన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్ దాఖలు



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాలలో నామినేషన్ల పరంపర మొదలైంది. శనివారం వెల్లంపల్లి గ్రామానికి చెందిన అబ్బాయి బుచ్చిరెడ్డి ఇండిపెండెంట్ క్యాండెట్ గా నామినేషన్ వేశారు. ఈయన గత ఆరు దఫాలుగా ఎమ్మెల్యేగా పోటీ చేయడం జరుగుతుంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత




**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూర్ గ్రామంలో ఇటీవల జంగాల కాలనీకి చెందిన సిరిగిరి వీరస్వామి అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరమ్మాయిలు ఒక అబ్బాయి సంతానం ఉన్నారు. వారిలో ఒక అమ్మాయి, ఒక అబ్బాయికి అంగవైకల్యం ఉంది. వీరి కుటుంబానికీ లయన్స్ క్లబ్ భీమదేవరపల్లి వారు 30కేజీల బియ్యం అందచేశారు. ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ కాశిరెడ్డి ఆదిరెడ్డి, ప్రెసిడెంట్ ఉప్పుల ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ గుడికందుల కిశోర్, ప్రధాకార్యదర్శి మోర కుమార్, శ్రీనాథ్, తిరుపతి, శేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు పుస్తకాల పంపిణీ



**వరంగల్ వాయిస్, మామునూర్ :** నాలుగో పటాలం" డి" కాయ్ "అన్యువల్ రిఫ్రెషర్ కోర్స్"లో భాగంగా నాలుగో బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం లక్ష్మీపురంలో గల "న్యూ లైఫ్ సొసైటీ బాలబాలికల అనాథాశ్రమం" సందర్శించి పుస్తకాలు, పెన్నులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్ పాల్గొని పిల్లల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఆశ్రమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు రాజారాం, మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ అభ్యర్థుల గెలుపునకు పని చేస్తాం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణలో రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీ అభ్యర్థుల గెలుపు కోసం బీసీ ఐక్య చైతన్య సమితి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ వారి గెలుపు కోసం మా సంఘం నుంచిప్రచారం చేస్తామని బీసీ ఐక్య చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్ తెలిపారు. బీసీలకు రాజ్యాధికారం వచ్చేంతవరకు మా ఉద్యమం కొనసాగుతూనే ఉంటుందన్నారు. బీసీలందరం ఏకమై శాసనసభలో 60శాతం బీసీలను గెలిపించుకొని మన సత్తా చాట వలసిన అవసరం ఉందని, మన హక్కులను మనమే కాపాడుకుందామని, మన ఓటు మనమే వేసుకుందామని పిలుపునిచ్చారు. బీసీలరా ఒకసారి ఆలోచించి బీసీ అభ్యర్థులకే ఓటు వేద్దామనే నినాదంతో ముందుకు పోదామన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
శనివారం 04, నవంబర్ 2023
www.warangalvoice.net

# ఓటు వినియోగంలో యువత సత్తా చాటాలి

## జిల్లా ఎన్నికల అధికారి శశాంక



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఓటు హక్కు పొందటంలో చూపిస్తున్న ఆసక్తి ఉత్సాహాన్ని ఓటు వేయడంలో కూడా చూపించి యువత సత్తా చాటాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక పిలుపునిచ్చారు. శనివారం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ స్వీప్ నోడల్ అధికారి ఆధ్వర్యంలో ఓటర్ చైతన్య అవగాహన కార్యక్రమాల్లో భాగంగా వివిధ కళాశాలల విద్యార్థులతో భారీ ఎత్తున ర్యాలీని జిల్లా ఎన్నికల అధికారి శశాంక పచ్చజెండా ఊపి ప్రారంభించారు. మరిపెడ మున్సిపల్ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి కార్గిల్ సెంటర్ వరకు భారీ ఎత్తున చేపట్టిన ర్యాలీలో అంగన్ వాడీ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాట్లాడుతూ భావి భారత పౌరులు ఉజ్వల భవిష్యత్తుకు ప్రతీకలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకుని వంద శాతం ఓటు వేసి యువత సత్తా చాటాలని యువతి యువకులకు ఉద్బోధ చేశారు. ఎన్నికల ఆదేశాల మేరకు 1 శాతంగా ఉన్న యువత ఓటర్ నమోదును నాలుగు శాతం పెంచడం జరిగిందన్నారు. నవంబర్ 30న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నందున యువత ఎన్ని కార్యక్రమాలు ఉన్నా వాయిదా వేసుకోవాలన్నారు. నిరాశ, నిర్లక్ష్యం, నిర్లిత్తత విడనాడాలని కోరారు. దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందనేది మరిచిపోరాదన్నారు. ఓటు వేయడం యువత బాధ్యతగా గుర్తించి తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొని యువతకు ఉత్తేజాన్ని ఇచ్చారు. యువతీ యువకులు ఉద్యోగులు సిబ్బంది భారీ ఎత్తున పాల్గొని ప్లకార్డ్స్, ఫ్లెక్సీలతో నినాదాలు చేస్తూ పట్టణ ప్రజలను ఆలోచింపజేశారు. తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పై రూపొందించిన ఫ్లెక్సీల ప్రచారాన్ని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ తో ప్రారంభింపజేశారు. ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని ఫొటోతో ప్రచారం చేశారు. ఈ ఎన్నికల స్వీప్ ప్రచార కార్యక్రమంలో డీఎస్ పీ వెంకటేశ్వర బాబు, ఎంపీడీవో ధన్సింగ్, మున్సిపల్ కమిషనర్ రాజు, స్వీప్ నోడల్ అధికారి తాసిల్దార్ నరేష్, సిబ్బంది, యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, రేగొండ :** కాలంతో పరిగెత్తే ఈ రోజుల్లో 23సంవత్సరాల తర్వాత స్నేహితుడికి పూర్వ విద్యార్థులు మేమున్నామని భరోసా కల్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి ఆర్థిక సాయం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. రేగొండ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అజ్మీర్ పాష గత 20 రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఇటీవలే ఇంటికి చేరుకున్న అజ్మీర్ పాషను తనతో పాటు 2000సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న తోటి స్నేహితులు శనివారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.13వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అజ్మీర్ తోటి చదువుకున్న స్నేహితులు పట్టేం కోటి లింగం, మాదురి ముక్తీశ్వర్, గన్ రెడ్డి మనోహర్ రెడ్డి ఉన్నారు.

## కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** నియోజకవర్గం పరిధిలోని కట్ర్యాల గ్రామం నుంచి శనివారం బీఆర్ఎస్ పార్టీ నుంచి 50మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వర్ధన్నపేట మండలం మైనార్టీ అధ్యక్షుడు ఎండీ అక్బర్, నాంపల్లి రవీందర్, మిట్టపల్లి వెంకన్న, దొమ్మటి రాము, తీగల సునీత, గజ్జల సంజీవ ఆధ్వర్యంలో చేరగా కేఆర్ నాగరాజు వారిని కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో చీకటి కుమారస్వామి, బొంద్యాలు, ఎండీ రహీం పాషా, కృష్ణ శ్రీపాద, బండారి వెంకన్న, గోరకుంటే మల్లేశం, తాటికొండ వీరేశం, షరీఫ్, బికారి యాకూబ్, చెంగల సారయ్య, చిక్కొండ ఎల్లయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## సేవ చెసే నాయకుడిని ఆశీర్వదించండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మేరు కుల వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ భద్రకాళి మేరు కుల మహిళ పొదుపు, పరపతి సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని అధ్యక్షుడు పొడిశెట్టి అనిల్ కుమార్ సభాధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ భరోసానే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తుందన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నటువంటి ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానిదని అన్నారు. ఇటీవల హనుమకొండకు విచ్చేసిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ మెజారిటీ ఖాయం, గతంలో కంటే 50,000 పైచీలకు మెజార్టీతో గెలుస్తావని చెప్పారని తెలిపారు. ఇక్కడికి వచ్చినటువంటి వారి ఉత్సాహం,పట్టుదల చూస్తుంటే అది ఖచ్చితంగా నెరవేరుతుంది అన్నారు. ఇంత పెద్ద ఎత్తున విచ్చేసి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ సుందర్ రాజు యాదవ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్ధన్ గౌడ్, కార్పొరేటర్ రంజిత్ రావు, మేరు కుల సంఘం నాయకులు వెంకట్రాజం, రామగిరి రాజు, కీర్తి జయంత్, సంతోష్, ప్రభాకర్, రాకేష్, సాయి లత, అరుణ, బుర్ర శ్రీనివాస్, వెంకటేష్, పుప్పల ప్రభాకర్, చంద్రశేఖర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపే లక్ష్యం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని గుర్తూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల రంగయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్యమైన నాయకులు పాలకుర్తి నియోజకవర్గం నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్ రావు ను ఓడించడానికి ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్ సైనికుల పనిచేయాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ తొర్రూర్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రతి కుటుంబానికి చేరే విధంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గౌడ సంఘం సొసైటీ మాజీ అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్, గట్టు రామన్న గౌడ్, ముఖ్య నాయకులు ఉమ్మగాని శీను, ఉమ్మగాని సత్యం, ఉమ్మగాని ఎల్ల గౌడ్, పంజాల రవి, మెరుగు సోములు, ముత్యం యాకన్న , ఈదునూరు సోమయ్య, ఈదునూరు సాయిలు, ఎండీ భాష, పాలకుర్తి రమేష్ తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్తినేని సోమేశ్వరరావు, గుర్తూరు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూతురు మన్మోహన్ రెడ్డి, ఏర్పుల భిక్షం, పిల్లి ఐలయ్య, గుద్దేటి సత్యనారాయణ, ముత్యం అన్వేష్ గౌడ్, ఏర్పుల సాగర్, పంజాల మురళి, పిట్టల చింటూ, వెల్తూరి సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు అవగాహన ర్యాలీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా కేంద్ లోని 30వ డివిజన్ బాలసముద్రంలో శనివారం వరంగల్ మహానగర పాలక సంస్థ ఓటు ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించింది. నోడల్ అధికారి ఎం.శ్రీనివాస్, బిల్ కలెక్టర్ ఎం.ఉమామహేశ్వర్ రావుతో పాటుగా గ్రేటర్ మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీస్ సర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

# దీవించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..

## బీజేపీ అభ్యర్థి డాక్టర్ కాళీ ప్రసాదరావు



**వరంగల్ వాయిస్, పరకాల :** నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మీ దీవెనలు ఇవ్వండి..పరకాల నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని పరకాల నియోజకవర్గ బీజేపీ పార్టీ అభ్యర్థి పగడాల కాళీ ప్రసాదరావు అన్నారు. పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ రతన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, గొర్ల కాపర్ల సంఘం చైర్మన్ రాజయ్య యాదవ్, పరకాల నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కాళీ ప్రసాద్ రావు పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కాళి ప్రసాద్ రావు మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో తనకు ఒక్క అవకాశం ఇవ్వండని, అభివృద్ధి అంటే ఏంటో చూపెడతానని తెలిపారు. ప్రతి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పేర్కొన్నారు. మీ అందరి కృషి ఉంటే భారీ మెజార్టీతో గెలుపొందుతానని అన్నారు. పరకాల ఎమ్మెల్యే దోచుకుని దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సంపాదించినది సరిపోలేదని, మరింత దోచుకునేందుకు మూడోసారి పోటీ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డి గురించి మాట్లాడుతూ ఇంతకు మునుపు మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసినా సరిపోలేదని మరో మారు ప్రయత్నం చేస్తున్నాడని, నాకు మాత్రం ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండని, మీకు సేవ చేసుకుంటానని కోరారు. ప్రతి కార్యకర్త ఒక కాళీ ప్రసాద్ అనుకొని 25 రోజులు కష్టపడితే బీజేపీ జెండా లక్ష మెజారిటీతో గెలుస్తుందన్నారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని తెలిపారు.

## మృతుడి కుటుంబానికి నాగుర్ల పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లె గ్రామానికి చెందిన తాళ్ల పెల్లి రవి గౌడ్ గుండెపోటుతో మృతి చెందగా శనివారం వారి కుటుంబ సభ్యులను రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాంబశివరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ నాగూర్ల ధర్మారావు, రైతు సంఘం నాయకులు వరికెల కిషన్ రావు, సూరవు రాజయ్య, శివ రావు తదితరులు పాల్గొన్నారు.








- గడ్డం కేశవమూర్తి

# నాన్న కళ్లలో ఆనందం చూడాలి

- **తండ్రి విజయానికి వినీత్ ఆరాటం**
- **ప్రదీప్ రావును అసెంబ్లికి పంపడమే లక్ష్యంగా అడుగులు**
- **తూర్పులో కాషాయ జెండా ఎగరడం ఖాయం**
- **కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందిస్తాం..**
- **బీజేపీ యువనేత ఎర్రబెల్లి వినీత్ రావు**

నాన్న కళ్లలో ఆనందం చూడాలి..ఎన్నో ఏళ్లుగా అసెంబ్లీలో అడుగు పెట్టాలన్న ఆయన కళను నిజం చేయాలన్న పట్టుదలతో వరంగల్ తూర్పు భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు తనయుడు, యువనేత, ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు అడుగులు వేస్తున్నారు. ప్రతిసారి అవకాశం దక్కినట్టే దక్కి చివరి క్షణంలో చేజారిపోవడంతో కుంగుబాటుకు గురైన ప్రదీప్ రావును ఈ సారి ఎలాగైనా విజేతగా నిలుపాలన్న పట్టుదలతో వినీత్ రావు వ్యూహ రచన చేస్తున్నారు. ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలను ఒక్కటి చేస్తూ ప్రచారంలో తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. వరంగల్ తూర్పులో కాషాయ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అమలు కానీ హామీలు ఇస్తూ, ప్రజల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని బీజేపీ యువనేత, ఎర్రబెల్లి ప్రదీప్ రావు (ఏపీఆర్) చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు ఆరోపించారు. సీఎం కేసీఆర్ వ్యవహారాలన్నీ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. 'వరంగల్ వాయిస్' ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబ పాలనకు, తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల పోరాటంలో బీజేపీ విజయపథాన నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు అండగా నిలువడమే ఏపీఆర్ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న మెగా జాబ్ మేళా నిర్వహించి వేయి మందికిపైగా నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు వినీత్ రావు వెల్లడించారు.

## కుటుంబ పాలనను అంతమొందిస్తాం..

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన సాగుతోందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రజారంజక పాలన సాగిస్తుంటే.. రాష్ట్రంలో కేసీఆర్ మాత్రం కుటుంబ పాలన సాగిస్తున్నారన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో ఎందరో నిరుద్యోగులు ప్రాణాలు తీసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటులో జీవితాలు మారతాయని కలలు కన్న యువతకు కేసీఆర్ అన్యాయం చేశారన్నారు. అవినీతి, అరాచక, నియంత పాలనకు ముగింపు పలకాలని ఎర్రబెల్లి వినీత రావు పిలుపునిచ్చారు. ఓవైపు సీఎం, ఆయన కుటుంబం, అవినీతి మంత్రులు ఉంటే.., మరోవైపు తెలంగాణ ప్రజలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువకులు, బీజేపీ ఉందని తెలిపారు. రాజు లాగా రాష్ట్రంపై కేసీఆర్, కేటీఆర్ పెత్తనం చలాయిస్తున్నారని, పేదలను సీఎం కేసీఆర్ దోచుకున్నారని విమర్శించారు.

## ధరణితో దగా పడ్డ రైతులు..

ప్రభుత్వం ధరణి పేరుతో పేదల భూములు గుంజుకుంటున్నదని మండిపడ్డారు. ఈ–పోర్టల్ తో కల్వకుంట్ల కుటుంబానికి లాభం జరుగుతుంది. దళిత, గిరిజనుల భూములు లాక్కున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలని వినీత్ రావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలు అప్రమత్తతతో ఆలోచించి ఓటు వేయకపోతే మళ్లీ దోపిడి పాలనే వస్తుందని ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. బీజేపీని అధికారంలోనికి తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ కుటుంబ పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కల్వకుంట్ల కుటుంబాన్ని ఇంటికి పంపడం ఖాయమన్నారు.

## ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తాం..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో తన తండ్రి బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు గెలుపుని ఎవరు ఆపలేరన్నారు. ఈసారి తూర్పులో కాషాయ జెండా తప్పక ఎగురుతుందని చెప్పారు. ప్రజా సమస్యలు పట్టించుకోని వారికి ఓట్లు వేయవద్దని ఆయన కోరారు. ప్రదీప్ రావును ఆశీర్వదించి గెలిపిస్తే వరంగల్ తూర్పును అభివృద్ధి బాట పట్టించి రుణం తీర్చుకుంటారని చెప్పారు. అంతేగాక వరంగల్ ను మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తారని వినీత్ రావు హామీ ఇచ్చారు. ప్రదీప్ రావు గెలిస్తేనే వరంగల్ తూర్పులో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ప్రజలను మోసం చేయడానికి ఓట్ల కోసం వస్తున్నారని వారిని నమ్మి మోసపోవద్దన్నారు. ప్రలోభాలకు గురికాకుండా బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావును గెలిపించాలన్నారు. నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమని వినీత్ రావు ధీమా వ్యక్తం చేశారు.












# పాలన గొప్పగా సాగుతోంది

**అభివృద్ధి, సంక్షేమం దిశగా సాగుతున్నాం**

**తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చే దిశగా సాగుతున్నామని, అభివృద్ధి, సంక్షేమాలతో దేశంలోనే నెంబర్ వన్ గా నిలుస్తున్నామని వరంగల్ తూర్పు బీఆర్ ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నగరంలోని 32,33,34,35,36,39 డివిజన్ల పరిధిలోని బాధ్యులతో ఆకుతోట కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్, బీఆర్ఎస్ వరంగల్ తూర్పు ఎన్నికల ఇంచార్జి బండా ప్రకాష్, ఖాదీ బోర్డ్ చైర్మన్ మౌలానాతో కలిసి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బండా ప్రకాష్ మాట్లాడుతూ..మన కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉండి కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమం ప్రజల కళ్ళకు కట్టినట్టు వివరించాలన్నారు.

ఎమ్మెల్యే నరేందర్ తూర్పు నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేశారని కొనియాడారు. చేసిన అభివృద్ధిని, కాలనీలోని ప్రగతిని కేసీఆర్ సర్కారు ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరికీ తెలిసేలా వివరించి ఓటు అభ్యర్థించాలన్నారు. కేసీఆర్ గెలుపు ఆవశ్యకతతోపాటు కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ పాలకుల హత్యా రాజకీయాలు, బీజేపీ పార్టీ మతాల మధ్య కులాల మధ్య చిచ్చు పెట్టె విషయాన్ని ప్రజల్లో ఎండగడుతూ కేసీఆర్ మ్యానిఫెస్టోను బలంగా ప్రజల్లోకి తీసుకొని పోవాలన్నారు. అనంతరం నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ సర్కార్ ప్రజలకు గొప్ప పాలన అందిస్తుందన్నారు. లీడర్లు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి గెలుపుకు కృషి చేయాలన్నారు. ఒక పేద బిడ్డ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. రూ.500నౌకరితో ప్రారంభమైన జీవితం ఎన్నో ఒడుదొడుకులతో ఒక కార్పొరేటర్, మేయర్, ఎమ్మెల్యేగా ఎదిగేందుకు ఈ ప్రాంత ప్రజలు అవకాశం కల్పించారన్నారు. తనకు అవకాశం ఇచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రజల కోసమే ప్రజల్లోనే ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్నానన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు రూ.25వేల నిత్యావసర సరుకులు, రేమిడిసివర్ ఇంజక్షన్లు, మన బిడ్డలు గొప్పగా బతకాలని కోచింగ్ సెంటర్ ఏర్పటు చేశామన్నారు. వరదలు వస్తే ప్రజలను ఆదుకున్నామన్నారు. ఈ కార్యక్రమాలు అన్ని ప్రజల్లోనే ఉన్నాయన్నారు. అన్ని విధాలా అండగా ఉన్నాను, పండుగ పబ్బాల్లో ప్రజలతో ఉన్నానంటూ ప్రకటించారు. ఇప్పుడు వచ్చే నాయకులు గీసుగొండ, వంచనగిరి వారి రౌడీ రాజకీయాలు ఇన్ని ఏల్లు వారి వల్ల పడిన గోస ప్రజలకు వివరించాలన్నారు. ఈ ఒక్క నెల నాకోసం పని చేయండి మిగతా ఐదు ఏండ్లు మీకు సేవ చేస్తానంటూ ప్రకటించారు.





# ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరగాలి

**ఎన్నికల సామగ్రిని పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా అన్ని పార్టీలు, అధికారులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య కోరారు. ఈ నెల 30న జరుగనున్న శాసనసభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామగ్రిని శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట్ నియోజకవర్గాల పరిధిలోని 791 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పోలింగ్ సామగ్రి సిద్ధంగా ఉందని, కామన్ అడ్రస్ టాగ్స్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ కరదీపిక, అధికారుల పోలింగ్ అధికారుల చెక్ లిస్ట్, ఎంసీసీ నియామావళి తదితర సామాగ్రి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికలను ప్రశాంత, స్వేచ్ఛయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకునున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వాసు చంద్ర, ఎస్సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్ , ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ తదితరులు ఉన్నారు.

# తూర్పులో బీజేపీ జెండా ఎగురాలి

**కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశంలో ఎర్రబెల్లి ప్రదీప్ రావు**





**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురాలని ఆ పార్టీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ప్రదీప్ రావు క్యాంపు కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు, శక్తికేంద్ర ఇంచార్జీలు, బూత్ అధ్యక్షులు, డివిజన్ కోఆర్డినేటర్లు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ప్రదీప్ రావు మాట్లాడుతూ బూత్ స్థాయి కార్యకర్త నుండి ప్రతి నాయకుడిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఏ సమయంలో ఆపద వచ్చిన అండగా ఉంటానని, నేను ఎమ్మెల్యే అయితే బూత్ స్థాయి కార్యకర్త నుంచి అందరూ ఎమ్మెల్యేలు అయినట్టేనన్నారు. మీ ద్వారా పదిమందికైనా సేవ చేసే అవకాశం అందరికీ దొరుకుతుందని, అభివృద్ధిలో ప్రతి ఒక్కరు సమష్టిగా పనిచేసి ఈ నియోజకవర్గాన్ని ముందు వరుసలో నిలబెడుదామన్నారు. నేను ఎమ్మెల్యే అయినా తర్వాత ఎవరైనా నా ఆఫీస్ కార్యాలయానికి వచ్చి నా పక్కనే కూర్చొని మాట్లాడవచ్చునని, మిగతా వారిలా చేతులు కట్టుకొని గేటు ముందు పడిగాడుపులు పడాల్సిన అవసరంలేదన్నారు. తూర్పులో గెలిచే అవకాశాలు బీజేపీకి ఎక్కువగా ఉన్నాయన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే తప్పక విజయం మన సొంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పొన్ను రాధాక్రిష్ణన్, బీజేపీ జిల్లా ఇంచార్జ్ కోమటి రెడ్డి రాంగోపాల్ రెడ్డి, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు వంగాల సమ్మిరెడ్డి, ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, తూర్పు నియోజకవర్గ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్త, వరంగల్ పార్లమెంట్ కో–కన్వీనర్ అల్లం నాగరాజు, సీనియర్ నాయకులు గంట రవికుమార్, వన్నాల వెంకటరమణ, ఎరుకల రఘునారెడ్డి, కనుకుంట్ల రంజిత్, మాదాసు రాజు, మార్టిన్ లూథర్, గాడిపల్లి రాజేశ్వర్ రావు, బోడ విజయ్, మల్లాడి తిరుపతి రెడ్డి, జిల్లా పదాధికారులు, డివిజన్ ఇంచార్జ్ లు, అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇంచార్జ్ లు, బూత్ అధ్యక్షులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేతిలో చెయ్యేసి చెప్పు..

**ఇంటింటి ప్రచారంలో వాదా తీసుకుంటున్న రావు పద్మ**

**మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న జనం**





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజలకు మెరుగైన పాలన అందించడం ఒక్క బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ వరంగల్ పశ్చిమ అభ్యర్థి రావు పద్మ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నగరంలోని 4, 11వ డివిజన్లలో ఆమె విస్తృతంగా పర్యటించారు. రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురడం ఖాయమన్నారు. ఇంతకాలం ప్రజల సమస్యలను గాలికొదిలి నేడు అన్నీ మేమే చేశామంటూ అధికార బీఆర్ ఎస్ పార్టీ నేతలు ప్రజల ముందుకు వస్తున్నారంటూ దుయ్యబట్టారు. నగరంలో అభివృద్ధి జరిగింది అంటే అది కేవలం బీజేపీతోనే అన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరితో చేతిలో చెయ్యేసి వాదా తీసుకుంటున్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న, నిరుద్యోగ సమస్య తీరాలన్నా బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. నాలుగో డివిజన్ లోని రెడ్డి పాన్ షాప్ జంక్షన్, రెడ్డి కాలనీల్లో పర్యటించగా, 11వ డివిజన్ లోని జెమిని థియేటర్ జంక్షన్ లో ఆమె ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మర్తినేని ధర్మరావు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com